# ఇంటిల్లిపాదీ ధగధగా మిలమిలా!

## ఇల్లేరమ్మ కతలు



ప్రస్తుతం క్రిస్‌మస్ సెలవల్లో వున్నాం మనం. ఎంతో బాగా రాశా పరీక్షలు. తప్పకుండా ఫస్టొస్తాననుకున్నా. చివరికి డ్రాయింగూ, చేతి పనీ, కుట్టుపనీ, హిందీ అన్నిటికీ తలో వంద మార్కులూ పెట్టి కలిపి రాంకులిస్తే ఇంక నాకెక్కడ కుదురుతుందీ! చచ్చీ చెడీ ఏడో రాంకుట. చిన్నారి మూడో రాంకూ ఇందూ వాళ్లకేం వుండవు. తల్చుకుంటేనే బలే చికాకొచ్చేస్తోంది. లాభం లేదు. స్కూలు మారితే గానీ ఫస్టొచ్చేట్టు లేను. భాగ్యమ్మా వాళ్ల స్కూల్లో ఎంచక్కా చదువంటే చదువే! వేరే ఏం నేర్పరు. రాంకుల గోల కూడా వుండదనుకో! మన కిష్టమయితే చదూకోవచ్చు లేపోతే లేదు. అయినా ఇలా రాంకులని చెప్పి మాలో మాకు పోటీలేవిటీ తప్పు కదా!

అత్తయ్యగారి గొంతు వినిపిస్తోంది. ''మీ పెద్దది మా భాగ్యమ్మీడుదే కదా వదినగారూ?'' అంటూ. ''అవును. మహా అయితే ఆర్నెల్లు చిన్నదేమో? చైత్రమాసంలో పన్నెండో ఏడొస్తుంది. ఏం ఎందుకడుగుతున్నారు?'' అని అమ్మ గొంతు.

''అబ్బే మరేంలేదు. ఆడపిల్ల అలా వుత్తమెడతో తిరిగితే ఆయుక్షీణం కదా?'' అన్నారు.

''ఎవరికి ఆయుక్షీణం?'' అమ్మకి ఖంగారు పుట్టినట్లుంది.

''ఇంకెవరికీ? మా తమ్ముడు గారికే. ఆడపిల్లలు వుత్త మెడతో తండ్రి ఎదురుగా తిరక్కూడదు కదా! చిన్నగా ఓనవర్సు పెట్టి ఓ గొలుసు చేయించి మెళ్లో పడేయకూడదూ?''

''ఎక్కడ! మీకు తెలియనిదేవుంది? రోజువారీ వ్యవహారవే గుట్టుగా నడుపుకొస్తున్నా! బంగారాలు కొనాలంటే నెలజీతాల్లో అయే పనా? వాళ్ల స్కూల్లో కూడా బంగారాలు పెట్టుకోనియ్యరు కదా! పంటడబ్బొచ్చేప్పటికి చూద్దాంలెండి'' అని అమ్మ అంటోంది.

వెంటనే వెళ్లి పోయానక్కడికి. బొత్తిగా ఏవీ లేదని మనవే ఎందుకూ చాటింపేసుకోడం? ఎంత ఫ్రెండ్సయినా! మన నాన్న గురించి వాళ్లేం అనుకుంటారు! అన్నిటికీ చిన్నదానివి నీకెందుకూ అని నోరెత్తనీయరు గానీ విషయం తెలిశాక ఎలా వూరుకుంటాం?

''మా అమ్మకి వీశరాయంత బరువున్న వడ్డాణం వుందత్తయ్యగారూ పెట్లో! మా అమ్మకేమో నడుం పట్టదు. అది చెరిపిస్తే చిన్న గొలుసేం ఖర్మ! అందరం తలో పలకసర్లూ చేయించుకోవచ్చు. కానీ మా నాన్న వుప్పుకోరుగా! అది మార్చేస్తే బామ్మ గారి గుర్తుగా ఏవీ వుండదుట.''

''వడ్డాణం ఆవిడ గుర్తేవిటి? బంగారాల్లాటి మీలో ఆవిడే వాళ్ల కడుపున పండితేనూ! మీరే ఆవిడ అసలైన గుర్తులు. మీ నాన్నకి నే చెప్తాగా. ఏదీ నన్నోసారి చూడనీయండి'' అన్నారు.

అమ్మ నాకేసదోలా చూసి నెమ్మదిగా మధ్యగదిలోకి నడిచింది. మేమంతా వెనకాలే వెళ్లాం. నాన్న మంచం కిందున్న పెద్ద నల్లపెట్టె బయటకి లాగింది. లోపల నాన్న పెళ్లిసూటూ అమ్మ పెళ్లి చీరలూ నాకన్నప్రాశన చేసినప్పుడు తాతగారిచ్చిన వెండిగిన్నీ అమ్మవీ నాన్నవీ వెండి కంచాలూ నే ఎప్పుడూ చూడనివి బోల్డు బోల్డు ఫోటోలూ ఎన్నో వున్నాయందులో! అన్నిటికన్నా కింద ఇంకో పాత పట్టుచీర. అది బయటకి తీసి మళ్లీ పెట్టెకి తాళం వేసి లోపలికి తోసేసింది. ఆ పట్టుచీర మధ్యలో ధగాధగా మెరిసిపోతూ ఎంత ముద్దుగా వుందో వడ్డాణం.

కిందంతా వంకీలు వంకీలుగా డిజైను. దానికి మువ్వలు మువ్వలు. సూర్యుడిలా ఒకటే మెరుపు. నిజంగానే దాన్ని చూస్తే నాన్నకి పాపం బామ్మగారు గాపకం వస్తారేమో! పోనీమంటే అలాగని గట్టిగా అనుకునేందుకూ లేదు. ఎందుకంటే బామ్మగారు పోయేటప్పటికి నాన్నకి నాలుగేళ్ళే కదా! అప్పట్నించీ పాపం నాన్నని చిన్నతాత గారూ బామ్మగారే పెంచారు. ఆ వడ్డాణం జాగర్తగా దాచి అమ్మ పెళ్లిలో ఇచ్చారుట. ఆ వడ్డాణం చివరి రింగుకి పెట్టుకుంటే నాకు సరిగ్గా సరిపోయింది. కాసేపటు ఇటు తిరిగి తీసేసి అత్తయ్యగారికి పట్టుకెళ్లి చూపించాం.

ఆ వడ్డాణం చూసి ఆవిడెంత ఆశ్చర్యపడతారో అనుకున్నా. అబ్బే. ఏదో వంకాయో బెండకాయో చూసినట్లు అటుఇటు తిప్పి చూశారు. అవున్లే వడ్డాణాలు ఆవిడకేం కొత్త. ఉత్త రోజుల్లో మెడ నిండా ఎన్నెన్ని గొలుసులుంటాయో. చేతులకయితే ఎనిమిదేసి బంగారం గాజులుంటాయి. వాళ్లింట్లో పంకజం దగ్గిర్నించీ అందరికీ పొడుగు పొడుగు గొలుసులూ బంగారం గాజులూను. ఈ వేళంటే అత్తయ్యగారు మంచి మాటగా అడిగారు. మేం ఏవీ పెట్టుకోపోతే బయటవాళ్లెవరన్నా రేపు వేళాకోళానికి అడగచ్చు కదా!

# ఇంటిల్లిపాదీ ధగధగా మిలమిలా!

అత్తయ్యగారన్నారు అమ్మతో ''ముప్పై కాసులున్నట్టుంది. పూర్వోత్తరపు వస్తువు కదా. నలుగురు పిల్లలకీ నాలుగు నాలుగు కాసు లనుకున్నా పదహారూ పోతే మిగతా దానిలో మీకు పల్చగా ఓ రెండు జతల గాజులూ, ఓ రెండు వరసల పలకసర్లూ వస్తాయి. మీరోసారి మాట్లాడండి మా తమ్ముడు గారితో. సరేనంటే భద్రానికి కబురు చేస్తానం''టూ వడ్డాణం అమ్మచేతికిచ్చేశారు.

అమ్మ వెంటనే ఏం మాట్లాడలా! కాసేపాగి నెమ్మదిగా అంది.

''ఈయనతో వడ్డాణం విషయం ఎత్తడం నావల్ల కాదు. మా వెనకాల ఎవరైనా పెద్దవాళ్లున్నా మంచి చెడూ చెప్పేవాళ్లేమో. రేపేవి టనే ఆలోచనుండదాయనకి. పిల్లలా గోగు కాడల్లా ఎదిగి పోతు న్నారు. ఈ కంపెనీదీ ఎదుగూ బొదుగూ లేనుద్యోగం. ఒక్కో ప్పుడు ఈయన ఆలోచనా రైటే అనిపిస్తుంది. ఎన్నో అవసరాలకి కన్న తల్లిలానే ఆదుకుంది ఈ వస్తువు. ఏవిటో వదినగారూ! ముందు ముందు ఎలాగా అని ఆలోచిస్తూ వుంటే రాత్రిళ్లు నిద్దరే పట్టదూ!'' అని.

ఇంక అత్తయ్యగారేం మాట్లాడలేక వాళ్లింట్లోకెళ్లిపోయారు. నే గొలుసేసుకోపోతే మా నాన్నకి ఆయుక్షీణం అని నాకు తెలియనే తెలి యదు ఇన్నాళ్ళూ. తెలిస్తే అమ్మలా వూరుకునేదాన్నా? నాన్నకన్నా ముఖ్యవేవిటి? అమ్మ వరస చూస్తే ఈ విషయం నాన్న ముందెట్టే టట్లులేదు.

ఆలోచించగా సాయంత్రానికి నాకే ఓ వుపాయం తోచింది. చిన్నారిక్కూడా చెప్పలా. నెమ్మదిగా భాగ్యమ్మనడిగా ''భాగ్యమ్మా! ప్లీజ్ నీ గొలుసు ఓసారి వేసుకోనియ్యవా రెండ్రోజులు'' అని. 'అమ్మ నడిగిస్తానని' లోపలికెళ్లింది.

'దాని మెడలోది తియ్యొద్దు. వుండు చెప్తా' బీరువాలోంచి కృష్ణుడి లాకెట్టువున్న సన్నటి గొలుసు తీసి నా మెడలో వేశారు. ఆ గొలుసు చంటి పాపాయి బారసాలప్పుడు అత్తయ్యగారు చేయించా రట. ఆ గొలుసువేసుకుని అమ్మ కంటపడకుండా నాన్నొచ్చేవరకూ జాగర్తగా తిరిగా.

సాయంత్రం పెందరాళే వచ్చేశారు నాన్న. ఇంకా నీరు తియ్య లేదుగా కృష్ణలో. అందుకని తొందరగానే ఇంటికొచ్చేస్తారు. మంచి నీళ్లిచ్చా. కారప్పూస ప్లేటిచ్చా. మళ్లీ కాఫీ ఇచ్చా అన్నీ గుటుకు గుటుకు మింగడవే కానీ తలెత్తి చూడనే చూడలే! ఇంకిలా కాదు పనుకుని,

''నాన్నా! ప్లీజ్ మనిద్దరం ఓ జట్టుండి చిన్నారీ ఇందుని ఓడి ద్దాం. కారెమ్స్ బోర్డు పెట్టనా'' అని అడిగా. కారెమ్సంటే కాదనరని నాకు తెలుసు కదా బాగా. ఎదురు బదురు కూచుని ఆడుతున్నాం. ఎంతసేపూ ఏదో కారెమ్స్‌లో ఛాంపియన్ అయిపోవాలన్నట్లు ఆ బోర్డు కేసి చూడ్డవేగానీ నన్ను చూస్తేగా. ఇంకో ప్రయత్నం చేద్దాం అనుకుని పిచ్చిగా వాగడం మొదలెట్టా. నోరు మూసుకునాడు అని తలెత్తకుండానే కసిరారు. ఇందు చేత్తో తోసిందని గట్టిగా దెబ్బలా టేసుకున్నా. అప్పుడది నాకేసి చూసి బ్రహ్మాండం బద్దలయినట్లు రిచింది.

''నాన్నా దీన్ని సరిగా చూడండి! ఎవరెవరివో గొలుసులు అడుక్కు తెచ్చి వేసుకుని తిరుగుతోంది'' అని. అప్పటికి చూశారు నాకేసి తలెత్తి.

''ఏవిటే అసయ్యంగా చిలకలపూడి బంగారం గొలుసేసుకు తిరుగుతున్నావు? ఎవరు కొనిపెట్టారు? మీ అమ్మేనా?'' అని కేక లేశారు.

''అయ్యో పిచ్చినాన్నా! ఇది అసలు బంగారం. అత్తయ్యగారి నడిగి తెచ్చుకున్నా. వాళ్ల చంటిపాపాయిదట. నాకిష్టమొచ్చినన్నాళ్లు వేసుకోమన్నారు. మా బీరువాలో ఏవన్నా పిల్లల్ని పెడుతుందా? నీ మెళ్లో వుండనీ అనిచ్చారు'' అని చెప్పా!

నాన్న ఒక్కసారి గబుక్కున బోర్డంతా కలిపేశారు. చిందర వందర చేసేశారు. సిగరెట్టు వెలిగించుకుని వీధిలోకెళ్లిపోయారు. ఇంక మనపని అయినట్లే. ఆ గొలుసు పట్టుకెళ్లి అత్తయ్యగారికిచ్చేసి నాన్న మంచం మీదే ముసుగెట్టి పడుకున్నా.

ఓ గంట తర్వాత వచ్చారు. ''సరోజీ! ఏదా దెయ్యం?. దాన్నిలా పిలూ'' అన్నారు.

''మీక్కోపం వచ్చిందని భయపడి మీ మంచమెక్కి ముసుగె ట్టింది. ఆడపిల్ల కదా అన్నీ వుంటే బాగుణ్ణనే వయసు కదా! వాళ్ల పిల్లల మెడల్లో చూసి ఆశపడ్డట్టుంది. నే చెప్పాగా! మీరేం కేకలేయ కండి దాన్ని! ఆవిడకా గొలుసు అప్పుడే ఇచ్చేసింది'' అని అమ్మ సర్ది చెప్పబోయింది.

''ఏడిసిందిలే. ఇదిలా వెళ్లి వూళ్లో వాళ్లని దేబిరిస్తూనే వుంటుం ది. ఇప్పట్నించీ బంగారం పిచ్చి పట్టినట్లుంది. అమ్మ వడ్డాణం చెరిపించి అయిదో ఆరో గొలుసులు చేయించి దీని మెళ్లో పడేయ్. వేసుకునూరేగుతుంది'' అన్నారు.

''అన్నీ దానికేనా నాన్నా! మీకెందరు కూతుళ్లున్నారో మర్చి పోయారా?'' అని చిన్నారి గొంతు విన్పించింది.

''చూశారా! అప్పుడే ఒకళ్లంటే ఒకళ్లు ఎలా వంతులొస్తు న్నారో! పంట డబ్బొచ్చాక పెద్ద వాళ్లిద్దరికీ చేయిద్దాం. ఆ వస్తువు కద పద్దు'' అని అమ్మ మళ్లీ చెప్పింది.

''ఇంకోసారి నోరెత్తద్దు! అది మార్చి అందరూ ఎవరికి కావల్సి నవి వాళ్లు చేయించుకుని సింగారించుకోండి. మరోసారి మనింట్లో ఇలా జరిగితే వూరుకునేది లేదు వినబడుతోందా?'' అని అమ్మని మళ్లీకసిరారు.

''బాగానే వుంది. మధ్యలో నేనేం చేశానూ!'' అని ''లేవ్వే గాడిదా! లే! పోయి నీ పక్కమీద పడుకో'' అని ఒక్కటేసింది. మొహం మీద దుప్పటి వేసుకుని ఎవర్నీ చూడకుండా పోయి చిన్నారి పక్కన పడుకున్నా.

ఈసారి సంకురాత్రి పండక్కి మావిడి పిందెల నెక్లెసూ రేడి యో గాజులలో నేనూ, మువ్వల నెక్లెసూ మిరియాల గాజులతో అమ్మా, వెంకటేశ్వరస్వామి వుంగరంలో నాన్నా ఇంటిల్లిపాదీ ఒకటే ధగధగా మిల మిలా. ఇంక అమ్మ హాయిగా ఏ పేరంటానికైనా దర్జాగా వెళ్లచ్చు. నాన్నతో చెప్పా,

''పాపం మీరే బామ్మగారిని ఇన్నాళ్లూ పెద్ద పెట్లో పడేసుం చారు. ఎవరికీ కనపడకుండా. ఇప్పుడు చూడండి - మీరు రోజూ చూసుకోవచ్చావిడని!'' అని.

**–సోమరాజుసుశీల**